

నేటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



సిరికొండ, ఫిబ్రవరి 18: మండలంలోని ఎదురుగొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మండలంలోని తూంపల్లి గ్రామ శివారులో గల ఎదురుగొండపై వెలిసిన లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బ్రహ్మోత్సవాలతో పాటు జాతర నిర్వహించనున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.



• పాత కలెక్టరేట్ స్థలం ఇలా..

పాత కలెక్టరేట్‌పై సర్కార్ నజర్

- నగరంలోని పాత కలెక్టరేట్ భూములపై ప్రభుత్వం దృష్టి
- ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగించుకునేందుకు అధికారుల పరిశీలన
- బస్టాండ్ లేదా ఇతర వాటికి వినియోగించే అవకాశం

నిజామాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నగరంలోని పాత కలెక్టరేట్ భూములపై ప్రభుత్వం నజర్ పెట్టింది. ఈ భూములను ప్రభుత్వం అవసరాల కోసం వినియోగించుకునేందుకు సిద్ధమవుతోంది. ఈ భూములలో అప్పటి ప్రభుత్వం అధునాతన సౌకర్యాలతో ఆడిటోరియం నిర్మాణం శంకుస్థాపన చేసింది. నగరం నడిబొడ్డున ఉన్న ఈ భూముల్లో ఆర్టీసీ బస్టాండ్ కానీ, స్టేడియం కానీ వినియోగించాలని నగర ప్రజలు పలుమార్లు అప్పటి ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. ఆడిటోరియం బదులు ఇతర అవసరాలకు వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఎంతో విలువైన ఈ భూములను ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగించుకోవాలని నిర్ణయిస్తున్నట్లు తెలుస్తోంది. మెడికల్ కళాశాలకు స్థలాలు అవసరం ఎక్కువగా ఉండటం వల్ల ఆర్టీసీ బస్టాండ్‌ను కాలేజీకి అప్పచెప్పి ఈ స్థలంలో బస్టాండ్ నిర్మించే ప్రతిపాదనలు కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇవే కాకుండా ఇతర అవసరాలకు వినియోగించేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

ఆడిటోరియం నిర్మాణానికి గత ప్రభుత్వం మొగ్గు


నిజామాబాద్ నగరం నడిబొడ్డున ఉన్న కలెక్టర్ కార్యాలయాన్ని అప్పటి ప్రభుత్వం బైపాస్ రోడ్‌లో నిర్మించిన కొత్త భవనానికి మార్చింది. ఈ స్థలం కోసం పలువురు వ్యాపారులు, ఇతర వర్గాల వారు ప్రయత్నాలు చేసినా అప్పటి ప్రభుత్వం ఆడిటోరియం నిర్మించేందుకు మొగ్గు చూపింది. ఆడిటోరియంతో పాటు ఈ స్థలంలో పార్కు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు 50 కోట్లతో ఆడిటోరియం నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. పాత భవనాలను కూలగొట్టి పనులను కూడా మొదలు పెట్టారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంతో పాటు ఇతర కార్యాలయాలను తరలించారు. కలెక్టర్ నివాస భవనాన్ని కూడా కూల గొట్టారు. ఆడిటోరియం పనులు చేపట్టారు. కలెక్టరేట్ ను బైపాస్ రోడ్‌కు తరలించిన తర్వాత చాలా మంది షాపింగ్ కాంప్లెక్స్‌కు, ఇతర నిర్మాణాల కోసం ప్రయత్నాలు చేశారు. ప్రభుత్వం మాత్రం ఈ స్థలాన్ని కేటాయించలేదు. పాత కలెక్టరేట్‌తో పాటు ఎదురుగా ఉన్న ఇరిగేషన్ స్థలాన్ని కూడా అవసరాల కోసం విని యోగించుకు నేందుకు కూలగొట్టారు. పాత కలెక్టరేట్ ఆవరణలో ఉన్న స్పోర్ట్స్ సంబంధిత స్టేడియాన్ని ఇరిగేషన్ స్థలానికి తరలించేందుకు ఏర్పాట్లను చేశారు. ఇరిగేషన్ కార్యాలయం స్థలాన్ని చదును చేయడంతో పాటుస్టేడియం నిర్మాణానికి అనుకూలంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు.

ప్రభుత్వ అవసరాల వినియోగానికి పరిశీలన

రాష్ట్రంలో ప్రభుత్వం మారి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. జిల్లా కేంద్రంలో అతి విలువైన పాత కలె క్టరేట్ భూములను ప్రభుత్వ అవసరాల కోసం విని యోగించుకోవాలని నిర్ణయానికి వస్తున్నట్లు తెలు స్తోంది. నగరం నడిబొడ్డున ఉండటం వల్ల ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్న ఈ స్థలాన్ని వారి అవసరాల కోసమే వినియోగించాలని నిర్ణయానికి వస్తున్నట్లు తెలుస్తుంది. బస్సు, రైలు మార్గాలకు స్థలం అందుబాటులో ఉండటంతో పాటు దగ్గరగా ఉండటం అందరికి మేలుగా ఉండే నిర్మాణాలు చేప ట్టాలని నిర్ణయానికి వస్తున్నట్లు అధికార పార్టీ నేతల సమాచారం బట్టి తెలుస్తోంది. ఆడిటోరియం వల్ల పెద్దగా ఉపయోగం ఉండదని ఈ స్థలంలో ఆర్టీసీ బస్టాండ్ కానీ, లేదా ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు కానీ ఏర్పాటు చేస్తే అందరికి అందుబాటులో ఉంటుందని నిర్ణయం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు జిల్లా కేంద్రం నుంచి ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసి పంపించాలని నిర్ణయానికి వస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ హయాంలో నగరంలో ఏర్పాటు చేసిన వైద్య కళాశాలకు స్థలం సరిపోవడం లేదు. ఎంబీబీఎస్‌తో పాటు ఎండీ కోర్సులు, ఇతర కోర్సులను ప్రవేశపెట్టడం వల్ల విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య కూడా భారీగా పెరి గింది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా కాలేజీకి స్థలాలు అవసరం ఉంది. ఆర్టీసీకి బస్సుల సంఖ్య పెరగడం వల్ల ప్రస్తుతం ఉన్న బస్టాండ్ సరిపోవడం లేదు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతు న్నాయి. ఎక్కువ బస్సులు వచ్చినప్పుడు ప్లాట్‌ఫామ్‌లతో పాటు స్థలం సరిపోవడం లేదు. కొన్ని బస్సులు బయటనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. నాలుగు రోడ్లు ఉన్న పాత కలెక్టరేట్ స్థలం కొత్త బస్టాండ్ నిర్మాణానికి బాగా ఉపయోగపడుతుందని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. బస్టాండ్ నిర్మాణానికి మొగ్గు చూపకుంటే ఇతర కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు కేటాయించేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

బస్టాండ్‌కు కేటాయించాలని వినతి

నగర ప్రజలతో పాటు జిల్లా ప్రజలు గతంలోనూ పాత కలెక్టరేట్ స్థలాన్ని బస్టాండ్‌కు కేటాయించాలని అప్పటి ప్రజాప్రతినిధులకు, అధికారులకు విజ్ఞప్తి చేశారు. పలు సంఘాల నేతలు కూడా అప్పటి మంత్రుల ను కలిసి వినతిపత్రాలను ఇచ్చారు. పాత కలెక్టరేట్ ఆవరణలో బస్టాండ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఒకవేళ బస్టాండ్ ఏర్పాటు చేయకుంటే నగర ప్రజలతో పాటు జిల్లా క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా భారీ స్టేడియాన్ని నిర్మించాలని కోరారు. నాగారంలో నిర్మించిన స్టేడియం ఎవరికి అందుబాటులో లేకపోవడం వల్ల దానిని ఇతర ప్రభుత్వ సంస్థలకు కేటాయించి ఈస్థలాన్ని ఇవ్వాలని క్రీడాసంఘాలు అప్పటి ప్రభుత్వాన్ని కోరాయి. మరికొంత మంది కలెక్టరేట్‌ను అక్కడికి తరలించే బదులు ఇక్కడే కొత్త భవనాన్ని నిర్మాణం చేసి ఏర్పాటు చేయాలని కోరారు. నగరం నడిబొడ్డున ఉండటం వల్ల ప్రజలందరికి ఉపయోగపడుతుందని అప్పుడు విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌ను తరలించడం వల్ల ప్రస్తుతం విలువైన ఈ భూమిని ప్రభుత్వ అవసరాలకు విని యోగించాలని నగర ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే నగరంలో ఆడిటోరియం ఉన్నందు వల్ల ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈ భూము లను ఉపయోగించాలని కోరుతున్నారు. పాత కలెక్టరేట్ పక్కనే ఉన్న ఇరిగేషన్ స్థలంపై కూడా కొన్ని సంఘాల నేతలు నజర్ పెట్టినట్లు తెలుస్తోంది.





• పంపు హౌజ్ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

• వృథాగా బర్దిపూర్ లిఫ్టు ఇరిగేషన్

చుక్కనీరు ఎత్తిపోయలే!

- మూలన పడ్డ బర్దిపూర్ లిఫ్టు ఇరిగేషన్
- పునర్నిర్మాణంపై రైతుల గంపెడు ఆశలు
- పట్టించుకోని గత పాలకులు, అధికారులు
- కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవాలని రైతుల వేడుకోలు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 18: జిల్లాలోని రైతులకు సాగునీరందించి పంట పొలాలను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి చేపడుతున్న ఎత్తిపోతల పథకాలు అలంకార ప్రాయంగానే మారుతున్నాయి. అందుబాటులో సాగునీరున్నా.. పథకాలు అక్కరకు రాకుండా పోతున్నాయి. నిర్వహణ లేక లిఫ్టు ఇరిగేషన్ యంత్రాలు తుప్పుబట్టిపోతున్నాయి. భద్రత లేకపోవడంతో పరికరాలు చోరీకి గురవుతున్నాయి. పాలకుల, అధికారుల నిర్లక్ష్యంతో ప్రజాధనం వృథా అవుతోంది. మండలంలోని రైతాంగానికి 2వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన బర్దిపూర్ ఎత్తిపోతల పథకం గత పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా పూర్తిగా నిరుపయోగంగా మారి మూలన పడింది. కోట్లాది రూపాయలతో రైతాంగానికి సాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ఎత్తిపోతల పథకంపై అలనపాలన కరువైంది. ఈ లిఫ్ట్ పరిధిలోని బర్దిపూర్, ధర్మారం, కమలాపూర్, ఘన్‌పూర్, మిట్టపల్లి, బీబీపూర్ గ్రామాల రైతుల ఆశలు సన్నగిల్లాయి. లిఫ్ట్5 ఎంవీ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి ఏడాదిన్నర గడిచినా ఇంతవరకు విద్యుత్ శాఖ అధికారులు కొత్తట్రాన్స్ ఫార్మర్ బిగించకపోవడంతో ఆయకట్టు రైతులు మండిపడుతున్నారు. ఎత్తిపోతల పర్యవేక్షణ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరించడంతో విలువైన మోటార్లు పనిచేయకుండా మూలన పడ్డాయి. ఇప్పటికే దొంగలు ఇనుపగేట్‌లను చోరీచేయగా మరికొంత మంది ఎత్తిపోతల పథకం వద్ద పేకటకు స్థావరంగా మార్చారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి లిఫ్టును పునర్నిర్మాణం చేసి పంటలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ లేక కాలిగా ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్



- ఈ నెల 29 నుంచి ఇంటర్, మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు
- ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులు
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు

పరీక్షా కాలం!

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 18: విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో చిన్న చిన్న విషయాలకే ఒత్తిళ్లకు గురవుతున్నారు. ప్రస్తుతం విద్యార్థులంతా వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు తమ వార్షిక పరీక్షలను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నారు. ప్రత్యేక తరగతులు, ప్రత్యేక పరీక్షల పేరుతో విద్యార్థులు రాత్రింబవళ్లు పరీక్షలపైనే తమ దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. మరో పది రోజుల్లో ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం కానుండగా వచ్చేనెల 18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. వార్షిక పరీక్షలు కావడంతో అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఒత్తిడికి గురవుతున్నారు. తమ పిల్లలు మెరుగైన ఫలితాలు సాధించాలని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పాఠశాలల యాజమాన్యాలు, కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. చదువు విషయంలో ఇంట్లో తల్లిదండ్రుల నుంచి మొదలుకొని కళాశాలలో అధ్యాపకుల వరకు అందరు విద్యార్థులపై ఒత్తిడిని పెంచుతున్నారు. ఎలాగైనా మంచి ఫలితాలు సాధించాలని పదే పదే వారికి చెబుతుంటారు. ఇలా వార్షిక పరీక్షల వేళ విద్యార్థులు ఒత్తిళ్లకు లోనవడం సహజమేనని కానీ తీవ్ర ఒత్తిళ్లకు లోనవుతే దాని ఫలితాలు వేరేవిధంగా ఉండే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు, మానసిక నిపుణులు సూచిస్తున్నారు. వార్షిక పరీక్షల విషయంలో మొదటి నుంచి విద్యార్థుల్లో ఉన్న భయాందోళనలు దూరం చేసేందుకు విద్యార్థులకు విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే మానసిక నిపుణులతో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తే విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఉండే అవకాశాలు ఉన్నాయి. కానీ ఏ విద్యాసంస్థ కూడా అలాంటి ప్రయత్నం చేయకపోవడం కేవలం పరీక్షల సమయంలోనే మానసిక నిపుణులతో తూతూ మంత్రంగా అవగాహన సదస్సులు నిర్వహించడం వల్ల ఎలాంటి ప్రయోజనంలేదని మానసిక నిపుణులు చెబుతున్నారు. జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలకు 22274 మంది విద్యార్థులు హాజరుకానుండగా, ఇంటర్మీడియట్ పరీక్షలకు 35346 మంది విద్యార్థులు హాజరవుతున్నారు.



ఆందోళన ఒకవైపు.. అనారోగ్యాలు మరోవైపు

జిల్లాలో ప్రస్తుతం భానుడి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం తీవ్ర ఎండకొడుతుండడంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతుండడంతో విద్యార్థులు కూడా అనారోగ్యాల బారినపడుతున్నారు. పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాలలో మంచి నీటి సౌకర్యం అంతంతమాత్రంగానే ఉంటుంది. ఎప్పుడో శుభ్రం చేసిన ట్యాంకుల్లో నిల్వచేసిన నీటిని తాగడం వల్ల విద్యార్థులు అనారోగ్యాలబారిన పడుతున్నారు. వసతిగృహాల్లో ఉండే విద్యార్థుల ఆహారం ఉదయం వండింది మధ్యాహ్నం వరకు పాడై మధ్యాహ్నం సరిగా భోజనం చేయని పరిస్థితి ఉంటుంది. కలుషితమైన తాగునీరు, సరైన ఆహారంలేకపోవడంతో విద్యార్థులు వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్ వంటి వ్యాధులబారిన పడుతున్నారు. ఎండలో తిరగడం వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. వార్షిక పరీక్షల వేళ విద్యార్థులు అస్వస్థతకు గురవడం, అనారోగ్యబారినపడి సరిగా చదవకపోవడంతో పరీక్షల్లో ఫెయిల్ అవుతామేమోనన్న భయం, తల్లిదండ్రుల ఒత్తిళ్లతో తీవ్ర మానసిక వేదనకు గురయ్యే అవకాశం ఉంది.

తల్లిదండ్రుల ఒత్తిడులు అధికం!

వార్షిక పరీక్షల వేళ రెసిడెన్షియల్ వస తి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి ప్రత్యేకమైన తరగతులు, స్టడీ హవర్స్ నిర్వహిస్తుంటారు. వారికి చదువు విషయంలో ఎక్కడా కూడా ఇబ్బందులు ఉండే అవకాశం లేదు. కొంతమంది చదువులో వెనకబడితే తప్ప చదువు విషయంలో వారి ఒత్తిళ్ల తక్కువే కానీ ఇంటి నుంచి పాఠశాలకు, కళాశాలలకు వెళ్లే డేస్కాలర్ విద్యార్థులకు మాత్రం పరీక్షల సమయంలో ఇంటిదగ్గరే ఉండి పరీక్షలకు సిద్ధం కావాల్సి ఉంటుంది. ఇంట్లోనే గంటలతరబడి చదువుకోవాల్సిన పరిస్థితి ఉండడంతో తల్లిదండ్రులు చీటికిమాటికి చదువుకో చదువుకో అంటూ ఒత్తిడికి గురిచేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కొంతమంది తల్లిదండ్రులు పనుల్లో బిజీగా ఉంటూ పిల్లల చదువుని పట్టించుకునే అవకాశాలు ఉండవు. ఇంట్లో ఉన్నతల్లులు మాత్రం ఇంటి పనుల్లో, టీవిల్లో, సెల్‌ఫోన్‌లలో నిమగ్నమవుతూ పిల్లలను పట్టించుకునే పరిస్థితి ఉండదు. మరికొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుతున్నారనే విషయం గ్రహించకుండా తరచూ ఘర్షణపడే పరిస్థితులు కూడా ఉంటాయి. పిల్లలు ఏం తింటున్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఆహారం ఇవ్వాలి. ఎంత సమయం పడుకోవాలి. అనే విషయాలను తల్లిదండ్రులు పట్టించుకోకుండా మార్కులు, ర్యాంకులు అంటూ పిల్లలను ఒత్తిడికి గురిచేస్తున్నారు. కాగా, విద్యార్థులను ఒత్తిళ్లకు గురిచేస్తే అనారోగ్యం బారిన పడి అసలుకే మోసం జరిగే అవకాశాలు ఉంటాయని మానసిక వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. తల్లిదండ్రులు పిల్లలను పదేపదే విసిగిస్తూ ఒత్తిడికి గురిచేయడం మంచిదికాదని సూచిస్తున్నారు.





ఘనంగా బోనాలు

ఆర్మూర్ మండలంలోని మామిడిపల్లిలో రేణుకఎల్లమ్మ ఆలయ 15 వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. ఐదు రోజుల పాటు జరిగే రేణుకమాత ఎల్లమ్మ వేడుకల్లో మామిడిపల్లి గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, గౌడ సంఘం సభ్యులు అధిక సంఖ్యలో హాజరై బోనాలు సమర్పించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సంగీత, మాజీసర్పంచ్ రవిగౌడ్, మహేందర్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, సాగర్‌గౌడ్, చిట్టిగౌడ్, గౌడ సంఘం సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

- ఆర్మూర్‌రూరల్

'ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు'


పీఎస్‌కు తరలించిన ఇసుక ట్రాక్టర్లు

ధర్పల్లి, ఫిబ్రవరి 18: మండలంలో అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై వంశీ కృష్ణారెడ్డి హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో అక్రమంగా రాత్రివేళల్లో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని చెప్పారు. రాత్రి వేళల్లో నిఘా పెంచినట్లు తెలిపారు. పెట్రోలింగ్ ముమ్మరం చేశామన్నారు.

కమ్మర్‌పల్లి బస్టాండ్‌లో కనీస అవసరాల కరువు

● మరుగుదొడ్లు ఉన్నా నెల రోజులుగా మూసివేత ● ఇబ్బందుల గురవుతున్న మహిళలు ● పట్టించుకోని సంబంధిత అధికారులు

కమ్మర్‌పల్లి,ఫిబ్రవరి18: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మరమ్మతు పనులు కొనసాగుతుండగా ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు గత నెల రోజులుగా మూసి ఉంచారు. దీంతో ప్రయాణికుల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ బస్టాండ్ మీదుగా రోజువారిగా వివిధ డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు వందల సంఖ్యలో ప్రయాణికులను చేరవేస్తాయి. అయితే గత రెండు 3 నెలలుగా బస్టాండ్‌లో ఆర్టీసీ సంస్థ మరమ్మతు పనులుచేపట్టింది. భవన మరమ్మతులతో పాటు ప్రహరీ నిర్మాణ పనులు పూర్తిచేశారు. కాగా మరుగుదొడ్ల ఔట్‌లెట్ పైపుల పనులు కొనసాగుతున్నాయి. మరమ్మతు కారణంగా మరుగుదొడ్లను గత నెలరోజులుగా మూసి ఉంచారు. గతకొన్ని రోజులగా పనులు సాగడంలేదు. సదరు కాంట్రాక్టర్ మరుగుదొడ్ల పనులు అర్థాంతరంగా నిలిపివేశారు. మరుగుదొడ్ల మరమ్మతు పనులు పూర్తికాక మూసి ఉంచడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. మరుగుదొడ్లు లేక ప్రయాణికులు ఎక్కడబడితే అక్కడే మూత్రవిసర్జన చేస్తున్నారు. కాగా పక్కనే ఉన్న ఉన్నత పాఠశాల ప్రహరీని ఆనుకుని మలమూత్రవిసర్జన చేయడంతో పాఠశాల తరగతి గదులవద్ద దుర్గంధ వాతావరణం ఏర్పడుతోంది. దీంతో విద్యార్థులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి మరుగుదొడ్ల మరమ్మత్తుపనులు సత్వరం పూర్తి చేయించి ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.


మూసి ఉంచిన మరుగుదొడ్లు


మూత్రశాలలు లేక బహిరంగ ప్రదేశంలో మూత్ర విసర్జన ప్రయాణికుడు

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

మోర్తాడ్, ఫిబ్రవరి 18: మండలంలోని దొన్కల్ గ్రామానికి చెందిన సరస్వతి విద్యానికేతన్ విద్యార్థులు రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో శనివారం జరిగిన ఈ పోటీల్లో ఆరో తరగతి విద్యార్థిని సీహెచ్.క్రాంతి, టి.నిహార్ సీనియర్ లెవల్‌లో కార్తిక్ ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ జి.నగేష్, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు లావణ్య, సౌజన్య, సుచిత్ర, సంజన, కోఆర్డినేటర్ లత అభినందించారు.


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యార్థులు సాంకేతిక రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

బోధన్ రూరల్, ఫిబ్రవరి 18: నేటి తరం విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక రంగాలలో రాణించాలని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డి అన్నారు. ఆదివారం విజేత కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లో ఉందని, కళాశాల విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి ప్రణాళికలతో చదవాలని సూచించారు. మంచి ఫలితాలు సాధించి కళాశాలకు, తమ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో విజేత కళాశాల డైరెక్టర్ రమణారెడ్డి, ప్రిన్సిపాల్ సీఎచ్. భూలక్ష్మిరెడ్డి, డైరెక్టర్ వై.అంజనాదేవి, ప్రిన్సిపాల్ సుప్రజారెడ్డితోపాటు అధ్యాపకుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బోధన్ డివిజన్‌లో స్వచ్ఛ లక్ష్యానికి దూరం

● వినియోగంలో లేని డంపింగ్ యార్డులు ● నిర్వహణ లోపంతో ఆచూకీ లేని స్వచ్ఛత ● గ్రామ ప్రత్యేక అధికారులు దృష్టి సారించాలి



ఏఆర్పీ క్యాంపు గ్రామంలో వృథాగా మారిన కంపోస్టు షెడ్


ప్రధాన రహదారి పక్కన చెత్తవేస్తున్న దృశ్యం

బోధన్ రూరల్, ఫిబ్రవరి 18: బోధన్ డివిజన్‌లోని ఎడపల్లి, రెంజల్, కోటగిరి, బోధన్, సాలూర మండల గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛత కోసం గత ప్రభుత్వం తగిన ప్రాధాన్యతనిచ్చింది. అందులో భాగంగా స్వచ్ఛ గ్రామాలుగా మార్చాలన్న లక్ష్యంతో ప్రతి పంచాయతీలో డంపింగ్ యార్డు, కంపోస్ట్ షెడ్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పల్లె ప్రగతిలో డంపింగ్ యార్డు నిర్మాణానికి లక్ష యాభై వేలు, కంపోస్టు షెడ్ నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద రెండు లక్షల యాభైవేల రూపాయలు నిధులు మంజూరు చేసింది. నిధులు మంజూరు చేయగానే ఆయా గ్రామాల్లో నాటి ప్రజాప్రతినిధులు వాటి నిర్మాణాలపై చూపిన శ్రద్ధ వాటి నిర్వహణపై చూపెట్టకపోవడంతో వాటి లక్ష్యం నెరవేర లేదు. దీంతో కంపోస్టు షెడ్‌లు నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండడంతో ప్రత్యేక అధికారులు స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి. అప్పుడే గ్రామాల్లో స్వచ్ఛత నెలకొంటుంది. ఎడపల్లి మండలంలో 17 గ్రామాలు, బోధన్,సాలూర మండలాలు కలిపి 38 గ్రామాలు, కోటగిరి, పోతంగల్ మండలాలో 28గ్రామ పంచాయతీలున్నాయి. ఒక్క పంచాయతీలో డంపింగ్ యార్డుకు లక్ష యాభైవేలు, కంపోస్టు షెడ్‌కు రెండు లక్షల యాభైవేల చొప్పున మూడేళ్ల క్రితం పనులు చేపట్టారు. ఆయా పంచాయతీల్లో స్వచ్ఛ భారత్ పాటు, ఆదాయాన్ని సమకూర్చేందుకు కంపోస్టు షెడ్లు నిర్మించారు. కంపోస్టు షెడ్‌లలో చెత్తను వేరు చేసేందుకు ఆరు కుండీలతో పాటు కంపోస్టు గదులు సైతం నిర్మించారు. తడి చెత్త, కూరగాయాలు, ఆహార వ్యర్థాలు తదితరాలను ఆయా కుండీల్లో వేసి ఎరువుగా మార్చాలి. పూర్తి చేసిన షెడ్లలో ఇప్పటి వరకు వినియోగించిన దాఖలాలు లేవు నిర్మించిన కొన్ని రోజుల పాటు చెత్తను కంపోస్టు షెడ్‌లకు తరలించి ఆ తరువాత వాటి నిర్వహణను మరచి పోవడంతో అవి వృథాగా మారాయి. కొన్నిచోట్ల యార్డుల సమీపంలోనే చెత్తకు నిప్పు పెడుతున్నారు. పంచాయతీలు యార్డులను వినియోగించకపోవడంతో ఎరువుల తయారి లేకుండా పోయింది. ఎరువుల తయారి చేపడితే పల్లె ప్రకృతి వనాలు, హరితహారం మొక్కలకు ఎంతో ఉపయోగంగా ఉండేది. ఆయా గ్రామాల పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ ఆశయం నెరవేర లేదు. ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ గ్రామంలో కంపోస్టు షెడ్‌ను అంబంకు వెల్లే ప్రదాన రహదారిలో నిర్మించారు. కంపోస్టు షెడ్‌లో ఇప్పటి వరకు ఎలాంటి చెత్తను వేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. రాంపూర్ గ్రామంలో గుట్ట ప్రాంతంలో నిర్మించిన షెడ్ అలంకార ప్రాయంగా మారింది. మరికొన్ని గ్రామాల్లో చెరువులు, గుట్టల ప్రాంతాల్లో డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికలు నిర్మించిన వినియోగంలోకి రాలేదు. రహదారుల వెంట చెత్తను డంప్ చేసి నిప్పు పెట్టి వదిలేస్తున్నారు. రహదారుల వెంట చెత్తను వేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం అయిపోయి ప్రత్యేక అధికారుల పాలనలో అయినా అధికారులు స్పందించి కంపోస్టు షెడ్, డంపింగ్ యార్డులు వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ఇకనైనా ప్రత్యేక అధికారులు పారిశుధ్యం, పరిశుభ్రతతపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని గ్రామాలలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

చెత్తను కంపోస్టు షెడ్‌లలో వేసేలా చర్యలు చేపడతాం



మండలంలోని గ్రామాలలో నిర్మించిన కంపోస్టు షెడ్‌లను పరిశీలిస్తాం. పంచాయితీ కార్మికులు గ్రామాలలో సేకరించిన చెత్తను కంపోస్టు షెడ్‌లలో వేసేలా చర్యలు చేపడతాం. పారిశుధ్యం, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. గ్రామ ప్రత్యేక అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచనలిస్తాం

-.గోపాల కృష్ణ ఎడపల్లి ఎంపీడీవో

తడపాకల్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు


పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు విద్యార్థులు

ఏర్గట్ల, ఫిబ్రవరి 18: మండలంలోని తడపాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నాటకాలు అందరిని అలరించాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో ఆంధ్రయ్య మాట్లాడుతూ తడపాకల్ పాఠశాలలోని విద్యార్థులు చదువుల్లోనూ, విద్యలో ముందున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ గౌడ్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి, ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ జావీద్, ఎస్సై మచ్చేందర్ రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా లీగల్ ఎయిడ్ సెక్రెటరీ పద్మావతి


ముప్కాల్‌లో మాట్లాడుతున్న జిల్లా లీగల్ ఎయిడ్ సెక్రెటరీ పద్మావతి

ముప్కాల్, ఫిబ్రవరి18: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అప్పుడే నేరాలు అదుపులో ఉంటాయని జిల్లా లీగల్ ఎయిడ్ సెక్రెటరీ పి.పద్మావతి అన్నారు. ఆదివారం ముప్కాల్ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నత పాఠశాల స్థాయిలో పాఠ్యంశాలలో రాజ్యాంగం, చట్టాలు సంబంధించిన పాఠ్యంశాలలోనే ఉంటాయన్నారు. పైచదువులు చదివి ఉన్నతస్థాయిలో స్థిరపడిన చట్టాలకు లోబడే ఉండాలని వివరించారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన రాజ్యాంగానికి లోబడి పని చేయాల్సిందేనని సూచించారు. మహిళలకు అన్యాయం జరిగిన అవేదన చెందకుండా ఆత్మస్థైర్యం కలిగి ఉండాలని, మహిళలపై అసభ్యంగా ప్రవర్తించి దాన్ని దాచిపెట్టకుండా ధైర్యంగా పోలీసులకు చెప్పాలని సూచించారు. తెలిసి తెలియని వయస్సులో చేసే నేరాలు బాల నేరస్థులుగా గుర్తిస్తారని, వీరికి ప్రత్యేకమైన జువలైన్‌హోంలో ఉంచుతారన్నారు. ప్రతీ ఒక్కరు ఐపీఎస్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. 14ఏళ్ల వరకు నిర్బంధ విద్య తప్పకుండా చదువుకోవాలని, మన పరిసరాల్లో 14ఏళ్ల లోపు ఎవరైనా పనులు చేస్తుంటే సమాచారం ఇవ్వాలని సూచించారు. 18, 21ఏళ్లు నిండిన తర్వాతే వివాహలు చేసుకోవాలని అవగాహన కల్పించాలని సూచించారు. ఫోక్సో చట్టాల గురించి, బాలకార్మికుల చట్టాలు, ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ న్యాయాధికారి వేముల దీప్తి ఎన్నికష్టాలు వచ్చిన చలించకుండా చదువుపైనే దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నామని చిన్నచూపు చూడకుండా చదువునేపై దృష్టి సారించాలని, అప్పుడే ఉన్నత స్థాయికి ఎదగవచ్చని అందుకు ఉదాహరణ మేమేనని, మేము కూడా ప్రభుత్వ పాఠశాల చదివి ఈస్థాయిలో ఉన్నామని విద్యార్థులకు ఆత్మస్థైర్యం కలిగించారు. విద్యార్థులకు క్విజ్ ప్రశ్నాలు అడిగి ఉన్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతిగా పుస్తకాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ముప్కాల్ ఎస్సై భాస్కరచారి, కోర్టు సూపరింటెండెంట్ రమేష్, మండల లీగల్ సర్వీస్ ఇన్‌చార్జి వసంత్, పాఠశాల ప్రిన్సిపాల్ వినోద, పాఠశాల ఉపాధ్యాయురాలు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అబాకస్, వేదిక్ గణిత పోటీలలో
సిరికొండ విద్యార్థుల విజయభేరీ




విద్యార్థులకు ప్రశంసా పత్రాలను మెమోంటోలను అందజేస్తున్న దృశ్యం

సిరికొండ ఫిబ్రవరి 18: జిల్లా స్థాయిలో విశ్వం ఎడ్యుటెక్ లాబ్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అబాకస్, వేదిక్ గణిత పోటీలలో సిరికొండ విద్యార్థులు విజయభేరి మోగించారు. జిల్లా కేంద్రంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.వీ దుర్గాప్రసాద్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలను మెమోంటోలను అందజేశారు.ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ లక్ష్యం పట్టుదల,నిరంతర సాధన చేసి పోటీ పరీక్షల్లో పాల్గొంటే విజయం మీసొంతం అవుతోందన్నారు.విద్యార్థుల్లో గణితం పట్ల ఉన్న భయాందోళనలు తొలగిపోయి సృజనాత్మకత పెరుగుతుందన్నారు. జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల వారికుంటే భయాందోళన తొలగిపోతుందన్నారు.అబాకస్‌లో గ్రామీణ ప్రాంతానికి చెందిన సిరికొండ విద్యార్థులు సత్యాశోధక్ పాఠశాల విద్యార్థులు విజయం సాధించడం పట్ల డీఈవో దుర్గాప్రసాద్ అభినందించారు. కార్యక్రమంలో ట్రస్మ జిల్లా అధ్యక్షుడు జయసింహాగౌడ్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీతారాముల బ్రహ్మోత్సవాలు

● సీతారాముల ఆలయం ముస్తాబు ● 19నుంచి 25వరకు ఖిల్లా డిచ్‌పల్లి రామాలయ బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఖిల్లా డిచ్‌పల్లి రామాలయం


ముస్తాబైన సీతరాముల విగ్రహలు

డిచ్‌పల్లి,ఫిబ్రవరి 18: చారిత్రాత్మక ఖిల్లా డిచ్‌పల్లి రామాలయం బ్రహ్మోత్సవాలు (నేటి నుంచి) ఈనెల 19 నుంచి 25వరకు సీతరామ చంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు వైభోపేతంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుద ర్శన్‌రెడ్డి, శాసనమండలి సభ్యుడు మహేశ్ కుమార్‌గౌడ్ లను ఆహ్వానించినట్లు ఆలయ ధర్మకర్తలి మండలి చైర్మన్ జంగం శాంతయ్య తెలిపారు.6రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలకు డిచ్‌పల్లి, ఇందల్వాయి, మోపాల్ మండలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలి రానున్నారు. 19న ఏకాదశి సందర్భంగా అంకుర్పారణం, అఖండ దీపా రాధన, రక్షబంధనంతో బ్రహ్మోత్సవ పూజలు ప్రారంభమై 21న సీతరా మచంద్ర స్వామి కల్యాణం, 23న రథోత్సవం, 24న జాతర (చక్రతీర్థం) కార్యక్రమాలు జరుగనున్నాయి. ఉత్సవాలు జరిగే ప్రతి రోజు భక్తులకు అన్నదానం నిర్వహించనున్నారు.

జక్రాన్‌పల్లిలో గోడప్రతుల ఆవిష్కరణ


గోడప్రతులను ఆవిష్కరిస్తున్న డివిజన్ కార్యదర్శి బి.దేవరాం

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి18: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో ఆదివారం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఐఎంఎల్ ప్రజాపంథ ఆధ్వర్యంలో ఆదివారం గోడప్రతులను ఆవిష్కరించారు. ఖమ్మంలో వచ్చేనెల 3, 4, 5తేదీలలో జరిగే ఐక్యత మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బి.దేవరాం, సబ్‌డివిజన్ కార్యదర్శి జి.కిషన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఐక్యత మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ గోడప్రతులను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఐఎంఎల్ ప్రజాపంథ నాయకులు, పీడీఎస్‌యు నాయకులు తలారి గంగాధర్, పీడీఎస్‌యు ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు అనిల్‌కుమార్, వంశీత్, నిఖిల్,కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నా.. ప్రయోజనం సున్నా

● బాన్సువాడలో ట్రాఫిక్ అస్తవ్యస్తం ● ఇష్టారీతిన ప్రయాణాలు● యథేచ్ఛగా సిగ్నల్స్ క్రాసింగ్ ● పోలీసు అధికారుల ఆదేశాలు బేఖాతరు

బాన్సువాడటౌన్, ఫిబ్రవరి 15: బాన్సువాడ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం అధికారులు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. కానీ వాహనదారులు మాత్రం యధేచ్ఛగా నియమాలను ఉల్లంఘిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య అస్థవ్యస్థంగా మారింది. ఏ వైపు నుంచి ఎవరు వస్తారో తెలియక తికమకపడుతున్నారు. కొన్నిసందర్భాల్లో వాహనాలు ఢీకొట్టుకుంటున్నాయి. అధికారులు చర్యలు తీసుకున్నట్లయితే ట్రాఫిక్ వ్యవస్థ గాడిలో పడినట్లవుతోందని పట్టణ ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

● ట్రాఫిక్ అస్థవ్యస్థం

బాన్సువాడ పట్టణానికి ప్రతీ రోజు చుట్టు పక్కల గ్రామాల నుంచి వందల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. వ్యాపారం, బ్యాంకులావాదేవీలు, అమ్మకాలు, కొనుగోల్లు ఇతరత్రా పనుల నిమిత్తం వస్తున్నారు.పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వాహనాలు వస్తుండడంతో పట్టణంలో రద్దీ పెరిగిపోయింది.ప్రధాన కూడళ్ల అయినటువంటి బస్టాండ్ ప్రాంతం, తాడ్కోల్ చౌరస్తా, బ్యాంకు ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలంగా మారింది. దీంతో అధికారులు ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు బస్టాండ్ ప్రాంతంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. కానీ వాహనదారులు మాత్రం యధేచ్ఛగా సిగ్నల్స్ జంప్ చేస్తూ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. దీంతో తరచూ వాహనదారులు ఒకరికొకరు ఢీకొట్టుకుంటున్నారు. కొంతమంది వాహనదారులు గాయాలపాలవుతున్నారు. సిగ్నల్స్ దగ్గర ట్రాఫిక్ కానిస్టేబుల్ హెచ్చరిస్తున్నా వాహనదారులు పట్టించుకోవడం లేదు. అంతేకాకుండా ఇష్టారీతిన ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తూనే ఉన్నారు.రెడ్‌సిగ్నల్ పడినా కానీ వాహనదారులు నియమాలను పాటించకపోవడంతో ట్రాఫిక్ సమస్యగా మారుతోంది. కనీసం సిగ్నల్స్ పడినపుడు ఎడమవైపు వెళ్లే వారికి దారి కూడా లేకుండా చేస్తున్నారు. పోలీసు అధికారులు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ దర్జాగా వ్యవహరిస్తున్నారు.


బాన్సువాడ పట్టణంలో ఇష్టారీతిన వాహనాలు తిరుగుతున్న దృశ్యం

సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి

వాహనదారులు ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్ చేయకుండా అధికారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి , ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారిపై జరిమానా విధించాలని మేధావులు అభిప్రాయపడుతున్నారు. పోలీసు అధికారులు వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప సమస్య పరిష్కారం కాదని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రధానోపాధ్యాయుడికి డాక్టరేట్

కోటగిరి,ఫిబ్రవరి18: పోతంగల్ మండలం కొడిచర్ల గ్రామానికి చెందిన నాగయ్య అనే ప్రధానోపాధ్యాయునికి యూనివర్సిటీ ఆఫ్ తోలోసా మెక్సికో ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. నాగయ్య ప్రస్తుతం మద్నూర్ మండలం పెద్ద ఎక్లారా జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఉపాధ్యాయుడిగా విధి నిర్వహణతో పాటు సమాజ సేవలో తనవంతు కృషి చేస్తున్న నాగయ్యకు డాక్టరేట్ ప్రధానం చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సిటి ఫంక్షన్ హాల్‌లో ఈ అవార్డును యూనివర్సిటీ కోఆర్డినేటర్స్ భూమన్న,రాజేశ్వర్, జనార్ధన్‌లు అందించారు. ప్రధానోపాధ్యాయుడికి డాక్టరేట్ అవార్డు ప్రధానం చేయడంపై ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

నలందలో పాజిటివ్ పేరెంటింగ్ వర్క్‌షాప్

మోస్రా,ఫిబ్రవరి18: మోస్రా మండలంలోని చింతకుంట గ్రామంలో గల నలంద విద్యానిలయంలో శనివారం పాజిటివ్ పేరెంటింగ్ వర్క్‌షాప్ నిర్వహించారు. ముందుగా సరస్వతీ దేవి విగ్రహానికి పూజ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పిల్లల ఎదుగుదల, తల్లిదండ్రుల విధివిధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత సైకాలజిస్ట్, మోటివేషన్ స్పీకర్ తిరునగరి శ్రీహరి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పాఠశాల చైర్మన్ లక్ష్మారెడ్డి

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

ధర్పల్లి, ఫిబ్రవరి 18:మండల కేంద్రంలో బాల్య వివాహాన్ని ఐసీడీఎస్, పోలీసులు అడ్డుకున్నారు. గ్రామంలో బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇచ్చారు. పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది బాల్య వివాహం జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి కౌన్సిలింగ్ నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను ఈ సందర్భంగా వారు వివరించారు. బాల్య వివాహాలు నేరమని చట్టరీత్యా శిక్ష అర్హులు అవుతారని వధువు, వరుడు కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ అనంతరం కుటుంబ సభ్యులు సైతం వివాహాన్ని విరమించుకున్నారు. మేజర్ అయిన తర్వాతనే పెళ్లి చేస్తామని అధికారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ లైన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జ్యోష్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బుజ్జి, ఎస్సై వంశీకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలి



మానవతసదన్‌లో చిన్నారులకు స్టీల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తున్న యోగాటీం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 18: మానవత సదన్‌చిన్నారులు ఉన్నత చదువుల్లో రాణించాలని, బోర్గాం యోగా టీం ప్రతినిధి ప్రభాకర్ అన్నారు. ఆదివారం డిచ్‌పల్లిలోని మానవత సదన్‌లో 130మందికి స్టీల్ వాటర్ బాటిళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధి ప్రభాకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువు ద్వారా ఏదైనా సాధించ వచ్చని చిన్నారులకు ఎల్లపుడు తాము అండగా ఉంటామని నాటి జిల్లా కలెక్టర్‌యోగిత రాణా అనాథ చిన్నారుల కోసం ఈ ఆశ్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యోగా టీం సభ్యులు సంతోశ్, రమేశ్, ప్రకాశ్, రమేశ్, జయప్రకాశ్ పాల్గొన్నారు.

మారుతి మందిరంలో అఘోర, శాంతి హోమం



హనుమాన్ ఆలయంలో అఘోర, శాంతి హోమం దృశ్యం

బోదన్ రూరల్, ఫిబ్రవరి 18: బోదన్ పట్టణంలోని మారుతి మందిరంలో పాత నవగ్రహ మండపం తొలగించి నూతనంగా ఏర్పాటు చేసిన నవగ్రహ మండపంలో విగ్రహ ప్రతిష్ఠాపనల కోసం ఆదివారం ఆలయంలో అఘోర, శాంతి హోమం కార్యక్రమాలను నిర్వహించారు. వేద పండితులు బ్రహ్మశ్రీ, నెట్టూరి వామనవధాని, ఆలయ అర్చకులు ప్రవీణ్ మహారాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నూతన నవగ్రహ మండపంలో నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం త్వరలో ఉంటుందని ప్రవీణ్ మహారాజ్ పేర్కొన్నారు. ప్రతి రోజు హనుమాన్ చాలీసా పటిస్తే సకల శుభాలు కలుగుతాయని ఆయన పేర్కొన్నారు. హిందూ బంధువులు ప్రతి రోజు ఆలయ ప్రదక్షిణలు చేయాలని, హిందూ ధర్మ పరిరక్షణకై ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు.

ప్రైవేటు బస్సు ఢీకొని ఉద్యోగి మృతి



ప్రమాదానికి కారణమైన బస్సు

ఖిల్లా, ఫిబ్రవరి 18: నగరంలోని వర్నిరోడ్ ప్రాంతంలో ఓ ప్రైవేటు బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ప్రభుత్వ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. నాల్గవ టౌన్ ఎస్సై సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని వైద్య ఆరోగ్య శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నాగరాజు అలియాస్ నారాయణ (53) కోటగల్లి నుంచి వెళ్తుండగా వెనుక వైపు నుంచి అతివేగంగా అజాగ్రత్తగా వచ్చిన ప్రైవేటు బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో నాగరాజు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సు డ్రైవర్ పరారైనట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్మూర్ మున్సిపల్‌లో ముందుకు సాగని అభివృద్ధి పనులు

- తూతూ మంత్రంగా పనులను చేయిస్తున్న కౌన్సిలర్లు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు



ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయం ఇదే..



ప్రధాన రోడ్డుపై కల్వర్టును తొలగించిన దృశ్యం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి18: మున్సిపల్ పరిధిలో గత నాలుగు నెలలుగా అభివృద్ధి పనులు లేక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వేసినట్టు ఉంది. స్థానిక కౌన్సిలర్‌లు ఏమి చేయలేని స్థితిలో చిన్నపాటి పనులు తూతూ మంత్రంగా చేస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు మున్సిపల్ సమావేశం సెప్టెంబరు 25న జరిగి పలు అభివృద్ధి పనులను తీర్మానించారు. తదుపరి రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల నోటిఫికేషన్‌తో పాటు ఎన్నికలు ముగిశాయి. దీంతో రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ పోయి కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడం జరిగింది. దీనికి తోడు మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని అవిశ్వాస పరీక్షకు నోటీస్ ఇవ్వగా అధికారులు జనవరి 4న అవిశ్వాస పరీక్ష నిర్వహించారు. అదే రోజు అవిశ్వాస పరీక్ష నెగ్గిందని తెలిపిన అధికారులు తదుపరి జరిగిన రాజకీయ పరిణామాల దృష్ట్యా విగిందా? నెగ్గిందా? అనే అయోమయంలో అధికారులు, ప్రజలు ఉన్నారు. అవిశ్వాస పరీక్ష విగిందని నెగ్గిందని తెల్చుకోలేకపోతున్నారు. దీనికి తోడు అవిశ్వాస పరీక్ష విగిందని పండిత్ వినీత హైకోర్టును ఆశ్రయించగా ఆశావాహులు సైతం హైకోర్టును ఆశ్రయించారు. ఇటీవల హైకోర్టు పండిత్ వినీత వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ నేటి వరకు అవిశ్వాస పరీక్షపై తుది నిర్ణయం తీసకోవాలని ప్రిన్సిపాల్ సెక్రెటరీకి నోటీసు జారి చేసింది. ఇలా కోర్టుల చుట్టూ మున్సిపల్ యవ్వారం తిరుగుతుంటే మున్సిపల్ పరిధిలో అభివృద్ధిని అధికారులు, నాయకులు పట్టించుకోక పోవడంతో అభివృద్ధి కుంటుపడిందని ప్రజలుఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు.

- పది రోజులుగా ప్రధాన రోడ్ బంద్

పట్టణంలోని పెద్దబజార్‌లో ప్రధాన రోడ్డు మధ్యలో జేసీబీతో డ్రైనేజీ కల్వర్టును పగులగొట్టి పది రోజులు కావస్తున్న నిర్మాణం చేయడానికి పట్టించుకున్న నాథుడే లేడు. మున్సిపల్ పరిధిలోని 31వార్డులో నివసిస్తున్న ప్రజలు వాళ్ళ ఇంట్లో నుంచి మురికినీరు డ్రైనేజీలో వచ్చి మూల మలుపు వద్ద కల్వర్టులో వెళ్లకుండా నిలిచిపోతున్నాదని మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో అప్పటి కమిషనర్ ప్రసాద్‌చౌహాన్ చొరవ తీసుకొని జేసీబీ సహాయంతో మురికినీరు వెళ్ళేల రోడ్ మధ్యలో గల డ్రైనేజీ కల్వర్టును తొలగించారు. నూతన డ్రైనేజీ నిర్మాణం చేయాలంటే మున్సిపల్ సమావేశంలో కల్వర్టుకు బడ్జెట్‌ను కేటాయించి పనులు నిర్వహించాలి. మున్సిపల్ సమావేశం జరిగేదేప్పుడు సమస్య పరిష్కారం అయ్యేదేప్పుడు అని ప్రజలు అధికారులపై, నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధిపై ఇన్‌చార్జి మంత్రి చొరవ చూపాలి



మున్సిపల్ పరిధిలో కుంటుపడిన అభివృద్ధిపై జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపెల్లి కృష్ణరావు చొరవ చూపాలని అన్నారు. గత నాలుగు నెలలుగా అభివృద్ధి లేక ప్రజలు అయోమయంలో ఉన్నారని, తక్షణమే అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలి.

- జీవీ.నర్సింహారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్

రూరల్ ఎమ్మెల్యే కుమారుడి వివాహానికి హాజరైన సీఎం

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 18: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కుమారుడు స్నేహిత్‌రెడ్డి వివాహం రిక్వితతో ఆదివారం హైదరాబాద్‌లోని జెన్విి కన్వెన్షన్‌లో జరుగగా ఈ వివాహానికి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మాజీ మంత్రులు సుదర్శన్‌రెడ్డి, జానారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, పెద్దపల్లి ఎమ్మెల్యే వివేక్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ హాజరయ్యారు. జిల్లాకు చెందిన ముఖ్య నేతలు మానాల మోహన్‌రెడ్డి, నగేష్‌రెడ్డి, తాహెర్‌బిన్ హంందాన్, గడుగు గంగాధర్, సునీల్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, రూరల్ నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్య నేతలు శేఖర్‌గౌడ్, ముప్పగంగారెడ్డిలు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు.

- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మానాల మోహన్‌రెడ్డి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆదివారం ఆయన నివాసంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు వేణురాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

డిచ్‌పల్లి: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.రేకుల పల్లి భూపతిరెడ్డి కుమారుడు స్నేహిత్-రిక్విత వివాహానికి ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి హాజరై నూతన వధువరులను ఆశీర్వాదించారు.ఆదివారం హైదరాబాద్‌లోని జెన్విక న్వెన్షన్‌లో జరిగిన వివాహ వేడు కలకు శాసన సభ స్పీకర్ గడ్డం ప్ర సాద్, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి,మాజీమంత్రి మండవ వెంకటేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాటిపల్లి నగేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సా రెడ్డి, జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు నూతనవధు వరులను ఆశీర్వాదించారు.



రూరల్ ఎమ్మెల్యే కుమారుడి వివాహానికి హాజరైన సీఎం, జిల్లా కాంగ్రెస్ నాయకులు

మద్నూర్‌లో రహదారిపైనే వార సంత



రహదారిపై వార సంత నిర్వహిస్తున్న దృశ్యం

మద్నూర్, ఫిబ్రవరి 18: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వారాం తపు సంతలో స్థానిక ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వారా ంతపు సంతలో అవస్థలను గుర్తించి వాటిని పరిష్కరిస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు. మండల కేంద్రంలోని గాంధీచౌక్ నుంచి పాత బస్టాండ్ వరకు సంత ఏర్పాటు చేయడంతో రోడ్డుపైన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. గాంధీచౌక్ నుంచి పాత బస్టాండ్ వరకు ఏర్పాటు చేస్తున్న సంత జరిగే స్థలం వెడల్పులో తక్కువగా ఉంటుంది. దాదాపు 42 గ్రామాల నుంచి ప్రజలు సంతకు వస్తుంటారు. ఈ గ్రామాల నుంచి వ్యాపారులు వస్తారు. వారికి ఇబ్బందులు తప్పడం లేదు. సంత రోజు గాంధీచౌక్ పాత బస్టాండ్ వరకు ఇరువైపుల నుంచి వ్యాపారులు కూరగాయల దుకణాలు ఉండడంతో కేవలం 4 ఫీట్ల రోడ్డు మాత్రమే ఉంటుంది. సంతలో తోచుకుంటూరావాల్సిన పరిస్థితి ఉంది. ఏదైన వాహనం గ్రామంలోకి రావాలంటే ఇదే దారిన రావాల్సి ఉంది. సంత మధ్యలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధం గా సంతకు వచ్చే ప్రజల కోసం మౌలిక వసతులు కల్పించాలని ప్రజ లు కోరుతున్నారు. గతంలో ఉన్న విధంగా గాంధీచౌక్ నుంచి నాలుగు వైపుల సంత జరిగే విధంగా ఏర్పాట్లు చేసినట్లైతే పాత బస్టాండ్ జాతీ య రహదారి వరకు సంత ఉండకుండా చూడాలని వ్యాపారులు కోరుతున్నారు. గాంధీచౌక్ నుంచి నాలుగు కూడళ్లలో సంత ఏర్పాటు చేయాలని ఇటీవల మద్నూర్ వ్యాపారులు మద్నూర్ గ్రామ పంచాయ తీ ప్రత్యేకాధికారికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి బండివార్ విజయ్ మాట్లాడుతూ ప్రజల కోసం మౌలిక వసతుల కల్పనలో భాగంగా మూత్రశాలల ఏర్పాటు కోసం 4 లక్షల నిధులను విడుదల చేసినట్లు తెలిపారు. మూత్రశాలల నిర్మాణంతో పాటు మండల కేంద్రంలోని నాలుగు కూడళ్లలో సంత జరిగే విధంగా ఏర్పాట్లు చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

నిజాంసాగర్ కాలువలో పూడికతీత పనుల ప్రారంభం



కొత్తపల్లిలో కాలువలో జేసీబీ సాయంతో పూడిక తొలగిస్తున్న దృశ్యం

కోటగిరి,ఫిబ్రవరి18: కోటగిరి ఉమ్మడి మండలంలో నిజాంసాగర్ కాలువ పూడిక తీత పనులను ఆదివారం మాజీ జడ్పీటీసీ శంకర్, కృష్ణారెడ్డిలు ప్రారంభించారు. నిజాంసాగర్ కాలువలో పూడిక పేరుకుపోయి చివరి ఆయకట్టుకు నీరు అందలేని పరిస్థితి తలెత్తింది. బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి సాగునీటి కాలువలను పరిశీలించారు. కోటగిరి మండలంలోని కొత్తపల్లి, ఎత్తొండ, పొతంగల్ మండలంలోని హంగర్గ ఫారం, హెగ్డోలి, శేషాద్రి ఫారం గ్రామాలకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాలువల్లో ముళ్లపొదలు పూడిక పెరిగి సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి తలెత్తింది. ఈ సమస్యపై కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. కాలువల్లో పూడిక తొలగించేందుకు సుమారు రూ.20లక్షల మంజూరు చేయించారు. కొత్తపల్లి గ్రామంలో సాగునీటి కాలువ మురికి కాలువగా మారింది. జేసీబీ సాయంతో కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలు చోట్ల కాలువలు శిథిలావస్థకు చేరగా మరమ్మతు పనులు సైతం చేపట్టి రైతులకు సక్రమంగా నీరు అందేలా కృషి చేస్తామని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. రబీలో పంటలకు సాగునీరు సరిపడ అందిస్తామని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు కొండా రెడ్డి, రమణారెడ్డి, జైపాల్, రవి, కోటిరెడ్డి, సుబ్బారెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గ్రామదేవతలకు సలిబోనాలు



ముప్కాల్‌లో బోనాలు ఎత్తుకున్న మహిళలు

ముప్కాల్, ఫిబ్రవరి18: ముప్కాల్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో గ్రామా భివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సలిబోనాలు సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను సమర్పించి అమ్మవారికి సలిబోనాలు సమర్పించుకొని కుటుంబాల ను సల్లంగా చూడాలని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమం లో గ్రామాభివృద్ధి కమిటీసభ్యులు,మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోటగిరి,ఫిబ్రవరి18: పొతంగల్ గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శనివారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. మంజీర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

అభివృద్ధిలో నాణ్యత లోపం

వర్ని,ఫిబ్రవరి18: గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షలాది రూపాయల నిధులు కేటాయిస్తున్న నిర్మాణ పనుల్లో నాణ్యత లోపం కారణంగా మున్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. గత ప్రభుత్వ హయంలో ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా వర్ని, చందూర్, రుద్రూర్ మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు పెద్ద ఎత్తున చేపట్టారు. కొన్ని గ్రామాల్లో అవసరం లేని చోట సైతం సీసీ రోడ్లను నిర్మించారు. వీటి నాణ్యత పనులను పరిశీలించాల్సిన పంచాయతీ రాజ్ అధికారులు అడ్డగోలుగా ఎంబీ రికార్డులు పూర్తి చేసి కాంట్రాక్టర్లు, నాయకులకు కొమ్ముకాశారు. దీంతో నిర్మించిన ఆరు నెలల్లోనే రోడ్లకు పగళ్లు ఏర్పడి కంకర తేలుతోంది. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లే రోడ్ల అభివృద్ధికి అతీ గతీ లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.



లక్ష్మీపూర్ క్యాంప్ వద్ద సీసీ రోడ్డుకు పగుళ్లు

ప్రైవేటు ఆసుపత్రి కంపౌండర్ హత్య



శ్రావణ్‌కుమార్ (ఫైల్)

ఖిల్లా, ఫిబ్రవరి 18: నగరంలోని 5వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల న్యాల్‌కల్ రోడ్‌లో వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేసిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. సీతారాంనగర్ కాలనీకి చెందిన శ్రావణ్‌కుమార్ (35)ను గుర్తుతెలియని వ్యక్తులు నగర శివారులోగల ఓ వెంచర్‌లో హత్య చేశారు. మృతుడు నగరంలోని ఖలీల్‌వాడిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. సమాచారం అందుకున్న నార్త్ రూరల్ ఇన్‌స్పెక్టర్ సతీష్, 5వ టౌన్ ఎస్సై అప్పారావు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. హత్యకు గల కారణాలను తెలియరాలేదని తెలిపారు. మృతుడు రోజులాగే రాత్రి విధులు నిర్వహించుకొని వెళ్తూ తనకు అలవాటున్న కల్లును తీసుకొని వెళ్లేవాడని ఈ నేపథ్యంలోనే ఎవరైనా అతన్ని వెంచర్‌వైపు తీసుకెళ్లి హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడు ఆలూర్ మండలం కల్లెడి గ్రామానికి చెందిన వాడు. ఉద్యోగ రిత్యా నగరంలో భార్య, పిల్లలతో నివాసం ఉంటున్నాడు.

21న ఆలయ ప్రాంగణ దుకాణాల వేలం పాట

మద్నూర్, ఫిబ్రవరి 18: మహారాష్ట్ర సరిహద్దులోని సలాబత్‌పూర్ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న దుకాణాలకు ఈ నెల 21 బుధవారం బహిరంగ వేలం పాట నిర్వహిస్తామని ఆలయ కార్యద ర్శి శ్రీధర్ తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనే ఆసక్తిగల వారు ఒక రోజు ముందు లేదా సమయానికి 2 గంటల ముందు 10 వేల రూపా యల డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు. దేవస్థానానికి చెందిన పూజా సామగ్రి అమ్మేందుకు వేలంపాట నిర్వహి స్తున్నట్లు తెలిపారు. జిల్లా దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు వేలం పాట నిర్వహి స్తున్నట్లు వెల్లడించారు.

చికెన్ ధరలు





రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.215	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.220	రూ. 250

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,000	రూ.59,000	రూ.755

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మదమే వెబ్ (ఇంగ్లీష్) (12.20)
: తేరి బాతోన్‌మే అయిసాఉల్జాదీయా (3.00)
: ఓయ్ (6.10)
: ఊరుపేరు భైరవకోన (9.40)

స్క్రీన్-2 : ఈగల్ (12.00, 10.00)
: హనుమాన్ (3.20, 6.40)

స్క్రీన్-3 : రాజధాని ఫైల్స్ (1.00)
: మదమే వెబ్-ఇంగ్లీష్ (4.20, 10.05)
: శివరాయాంచ చావ (మరాఠి) (7.00)

స్క్రీన్-4 : ప్రవీణ్ ఐపీఎస్ (12.50)
: ఊరుపేరు భైరవకోన (4.20)
: మదమే వెబ్-ఇంగ్లీష్ (7.20)
: తేరి బాతోన్‌మే అయిసాఉల్జాదీయా (10.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఊరుపేరు భైరవకోన (1.40, 7.35, 10.30)
: హనుమాన్ (4.30)

స్క్రీన్-2 : ఈగల్ (10.00, 10.30)
: ఓయ్ (1.00, 4.10, 7.20)

స్క్రీన్-3 : ఈగల్ (1.30, 4.30, 7.30)
: హనుమాన్ (10.30)



దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)

లలితమహల్ : ఈగల్ (11.15, 2.15, 6.15, 9.15)

నటరాజ్ : రాజధాని ఫైల్స్ (11.15, 2.15, 6.15, 9.15)

విజయ్ : ఊరుపేరు భైరవకోన (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్